
# ప్రజాశక్తి

శనివారం 14 సెప్టెంబర్ 2024 | 5 | విజయనగరం

## సైబర్ స్కామ్‌తో జాగ్రత్తగా ఉండండి

**ఎస్‌పి వకుల్ జిందాల్**

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిగ్ బుచరింగ్ అనే సైబర్ స్కామ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫేక్ మెసేజ్‌లు, యూజర్లను నమ్మించేలా ఫేక్ పేమెంట్‌లతో బురిడి కొట్టించి సొమ్ము చేసుకుంటారని తెలిపారు. పిగ్ బుచర్స్ ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లను క్రియేట్ చేసుకుంటారని,. ఆన్‌లైన్‌లో యాక్టీవ్‌గా ఉండే యూజర్ల నమ్మకాన్ని గెలుచుకునేలా ఆ ఫేక్ ప్రొఫైల్‌తో ప్రేమ, ఫ్రెండ్‌షిప్ పేరుతో దగ్గరవుతారని,. ఒక్కసారి యూజర్లు పిగ్ బుచర్స్‌ను నమ్మితే చాలు. ఇక వాళ్ల పని మొదలు పెడతారని వివరించారు. ఫేక్ జాబ్స్, అధికమొత్తంలో డబ్బులు సంపాదించుకునే అవకాశాల్ని కల్పిస్తున్నామంటూ ఆశచూపిస్తారన్నారు. ఆపై యూజర్ల అకౌంట్లలో ఉన్న మొత్తాన్ని దోచుకుంటారని, ప్రస్తుతం ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్‌పి తెలిపారు. ఇలాంటి వాటిని ఎవరూ ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని సూచించారు.

## సీతారాం ఏచూరి స్మృతి

# వామపక్ష శక్తులకు తీరనిలోటు



గజపతినగరం.. సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-గజపతినగరం

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి జిల్లా వ్యాప్తంగా వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఘన నివాళులర్పించారు. గజపతినగరం, పురిటిపెంటలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం, సిఐటియు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరిది చెరగని ముద్ర అని, పేదల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి అని అన్నారు. దేశ పరిస్థితులను అధ్యయనం చేసి అనేక సమస్యలపై పోరాడారని చెప్పారు. ఆయన బాటలో పయనించి ప్రజాపోరాటాలను బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.హరికృష్ణవేణి, ఎస్.బంగారు నాయుడు, లక్ష్మి, గౌరమ్మ, సిఐటియు నాయకులు అప్పలరాజు, కృష్ణ, గోవింద, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్ :** కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఎల్‌బిజి నగర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారంఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలబడ్డారని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, రైట్ టు ఇన్ఫర్మేషన్ చట్టం సాధించేందుకు మంచి కృషి చేశారని తెలిపారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథ సారధిగా సీతారాం ఏచూరి దేశ ప్రజానీకానికి చేసిన కృషి అమోఘమైనదని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తి మన మధ్య నుండి దూరం కావడం అత్యంత బాధాకరమని అన్నారు. ఏచూరి ఆశయాల సాధనకు, సమసమాజం కోసం కృషి చేయడమే నివాళి అని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుమారి, కృష్ణమ్మ, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.



బొబ్బిలి.. సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది

**బొబ్బిలి :** ప్రజా పోరాటాలతోనే సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించగలమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ జంక్షన్లో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై, లౌకికవాదాన్ని కాపాడేందుకు ఏచూరి నిరంతరం పోరాటం చేశారని చెప్పారు. సిఐటియు కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ప్రజాశక్తి ప్రతినిధులు జగన్, జగదీష్, దుర్గారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, సిఐటియు నాయకులు సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

**మెంటాడ :** మెంటాడలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గండ్రేటి అప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి రాజగోపాల్, సిఐటియు మండల అధ్యక్షులు పి.వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు సన్యాసమ్మ, కొండమ్మ, పి.శ్రీను, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**రాజాం :** మున్సిపల్ కార్యాలయం వద్ద సీతారాం ఏచూరి సంతాప సభను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థి, యువజన, కార్మిక నాయకులకు సీతారాం ఏచూరి స్ఫూర్తి ప్రదాతని కొనియాడారు. ముందుగా యూనియన్ సభ్యులు లక్ష్మి సిఐటియు జెండాను అవతనం చేశారు. యూనియన్ అధ్యక్షులు శ్రీను, కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు గురువులు, సిఐటియు నాయకులు త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తవలస :** కొత్తవలసలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గాడి అప్పారావు, ముఠా కార్మికులు, జిందాల్ కర్మాగారం వద్ద కంపెనీ డిజిఎం గోపాలకృష్ణ, సిఐటియు నాయకులు నమ్మి చినబాబు, ఐన్‌టియుసి నాయకులు, వైసిపి నాయకులు... సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**గరివిడి :** గరివిడి పట్టణంలో సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిఐటియు నాయకులు టివి రమణ మాట్లాడుతూ భారత రాజకీయాల్లో సీతారాం ఏచూరి తనదైన ముద్ర వేశారన్నారు. మతోన్మాదాన్ని ఎదుర్కోవడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరినాయుడు, మండల అధ్యక్షులు జె.విశ్వనాథరాజు, ఒఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** స్థానికమొయిద జంక్షన్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి వామపక్ష నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి నివాళులర్పించారు. విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యాన విద్యుత్ హమాలీలు నివాళులర్పించారు. హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, కెల్ల గోవిందరావు, పతివాడ రాంబాబు, చిన రాంబాబు, మీసాల లెనిన్, కలిశెట్టి శ్రీను పాల్గొన్నారు.



విజయనగరంటౌన్.. ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, తదితరులు

**శృంగవరపుకోట :** సీతారాం ఏచూరికి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన సిపిఎం, సిఐటియు నాయకులు, కార్మికులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెలికాని ముత్యాలు, కె.రమేష్, జి.సత్యనారాయణ, పి.రాజు, ఎం.శివ, జి.దేవి, టి.భారతి, ఎస్.కె హిమాం, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పోరాట యోధుడు ఏచూరి

**ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్**

**రాజాం :** ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏచూరి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కష్టతరమైన రాజకీయ దశల్లో పార్టీని నడిపించిన ఘనత ఏచూరిదేనని తెలిపారు. భారత రాజకీయాలకు మార్గదర్శకంగా వ్యవహరించారని చెప్పారు. అహర్నిశలు ఏచూరి ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని కితాబిచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### నింగికెగసిన ధ్రువతార

నిత్యం చెరగని చిరునవ్వు
కనేల్‌మని మోగే నీ కంఠం
పోరు దారుల్లో పరుగులు తీసే
నీ శబ్దాకారాలు మూగ బోయాయ్

కల్పకం పుత్రుడా ఏచూరి సీతారాం
నీవిప్పుడు మా మార్గదర్శివైనావు
మా భుజాలపై ఎర్రని కండువావై
మమ్ము తట్టి లేపుతూనే ఉంటావు

మాచేతిలో జెండావై ఎగురుతూనే
పోరాట స్ఫూర్తికి ప్రతిరూపమైనావు
భారత మాత మానస పుత్రుడా....
రాజ్యాంగ రక్షుడా నీకు లాల్ సలాం

నీకు మరణం లేదు కామ్రేడ్
ఎప్పటికీ నీకు మరణం లేదు
నీవు అమరుడువు...
నీవెప్పటికీ అమరుడువే

నీవు చూపిన బాటలోనే మేము
నీవు చెప్పిన సిద్ధాంతమే మాది
దోపిడీ కోటలు కూల్చే వరకు
మేము నిద్రపోం...అలసిపోం

శ్రమ ఫలితం వచ్చే వరకు
సామ్యవాద జెండా ఎర్రకోటపై
ఎగరేసే వరకు నీ చిరునవ్వు మా
గుండెల్లో దీపమై వెలుగుతావు
నింగిలోన ధ్రువతారవై మెరుస్తావు

- రెడ్డి శంకరరావు, విజయనగరం



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్యే మాధవి, అధికారులు

### మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో

## 18న మెగా జాబ్‌మేళా

- 29 ప్రముఖ కంపెనీల్లో 2500 పోస్టులకు ఇంటర్వ్యూ లు
- నిరుద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 18న నెల్లిమర్ల నియోజక వర్గం పరిధిలో భోగాపురం మండలం ముంజేరు గ్రామం వద్ద నున్న మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఎ.పి స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో కలసి కలెక్టర్ తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. ఎం.ఎల్.ఎ తో కలసి జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా కల్లెకర్ మాట్లాడుతూ 29 ప్రముఖ కంపనీలలో 2500 పోస్టులను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూ లు జరుగుతాయని, జిల్లా నిరుద్యోగ యువతకు మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 18 నుండి 36 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్ధులు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారికి నెలకు 12 వేల నుండి 60 వేల వరకు జీతం లభిస్తుందని తెలిపారు. స్థానికంగా , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో, హైదరాబాద్ లో ఎక్కువ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్ధులు తమ సర్టిఫికేట్లతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. స్థానిక కంపనీలలో స్థానికులకు 10 శాతం పోస్టులను కేటాయించాలని కంపెనీలను కలెక్టర్ కోరారు. అభ్యర్ధులు http://forms.gle/Dzulwm8Gd8AgshBt లింక్ ద్వారా దరఖాస్తులు పెట్టుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు జేయేష్ 8297192497 , తరుణ్ 8099461303 , భాస్కర్ 7995691295 నెంబర్లకు కాంటాక్ట్ చేయాలని తెలిపారు. ప్రధానంగా బొల్లినేని హోమ్స్ , సునైనా క్రియేషన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అరబిందో ఫార్మసీ, సినర్జీస్ , ఎల్.జి.ఎలక్ట్రానిక్స్ , రెడ్డిలాబ్స్ , అపోలో ఫార్మసీ , ముతూట్ ఫైనాన్సు, అమర రాజా బాటరీస్, ఎయిర్‌టెల్, నవతా రోడ్ ట్రాన్సుపోర్టు, శ్రీరాం, వరుణ్ మోటార్స్, అల్ట్రా టెక్ సిమెంట్, అమెజాన్, టిసిఎల్, తదితర కంపనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. సమావేశంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారి గోవిందరావు, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, ఉపాధి కల్పనా అధికారి అరుణ కుమారి పాల్గొన్నారు.

### 16న ప్రజా పరిష్కార వేదిక రద్దు

**విజయనగరం కోట :** ఈనెల 16న ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ నేపథ్యంలో జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజా పరిష్కార వేదికను రద్దు చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

**నగర పాలక సంస్థ కార్యాలయంలోనూ..**

**విజయనగరం టౌన్ :** ఈనెల 16న మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినం కావడంతో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పి. నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీలు అందించడానికి వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

## విద్యుత్తు శాఖ తీరుపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తెర్లాం

విద్యుత్తు శాఖ తీరుపై మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించారు. ప్రత్యేకంగా విద్యుత్తు శాఖపై సమీక్షలో సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. ప్రతి సమావేశంలోనూ విద్యుత్తు సమస్యలపై ఎన్నో ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉన్నా, పరిష్కారం చూపకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై జెడ్‌పి చైర్మన్ తీవ్రంగా స్పందించారు. విద్యుత్తు శాఖ వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. లోఓల్టేజ్, రైతుల బోర్లు, గ్రామాల్లో కిందికి వేలాడుతున్న తీగలు, విరిగిన స్తంభాలు.. ఇలా ప్రతి సమస్యపైనా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎఇని ఆదేశించారు. అవసరమైతే జిల్లా పరిషత్తు నిధుల నుంచి రూ.పది లక్షలు తక్షణమే మంజూరు చేస్తామని ప్రకటించారు. రైతులకు, ప్రజలకు ఎక్కడా కరెంటు సమస్య రాకూడదని తెగేసి చెప్పారు.

సమావేశంలో జెడ్‌పిటిసి జి.లుర్దు, మండల ప్రత్యేకాధికారి వి.టి.రామారావు, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, వైస్ ఎంపిపి సత్యనారాయణ, రమాదేవి, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## 37.6 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత



ఇంట్లో నిల్వ చేసిన పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి-మెరకముడిదాం

ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు మెరకముడిదాం మండలం గర్భాం కాలనీలో బుర్లె సురేష్ కుమార్, కొట్టడి సూర్య నారాయణ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 37.6 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. విచారణలో భాగంగా వారు ఆ బియ్యాన్ని లబ్దిదారుల వద్ద నుండి కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్మటానికి అక్రమంగా నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. రూ.17,10,800 విలువ కలిగిన పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసి సంబంధిత అక్రమ నిల్వదారులపై కేసు నమోదు చేసారు. ఈ దాడిలో విజిలెన్స్ డిఎస్‌పి కిరణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ సింహాచలం, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పౌర సరఫరాల ఉప తహశీల్దార్ రామారావు పాల్గొన్నారు.

### జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్టు ఎంపిక శుక్రవారం రాజీవ్ స్టేడియంలో జరిగింది. ఈ జట్టు ఈ నెల 14 నుండి 16 వరకు పలాస లో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటాయి. కార్యక్రమంలో జిల్లా టెన్ని కాయిట్ సంఘ కార్యదర్శి ఎం రామారావు , డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వర రావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణం రాజు, పీడీలు శివ, శ్రీను, తిరుపతి,గోపాల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**యోగా క్రీడాకారులు...** విశాఖపట్నం జిల్లాలో ఈనెల 14,15 తేదీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మూడు విభాగాల్లో జిల్లా నుంచి 30 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కోచ్ , మేనేజర్లుగా బి.యశోద, అర్ రూపదేవీ వ్యవహరించనున్నారని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అవనాపు విక్రమ్, బి.సన్యాసిరావు తెలిపారు. ఎంపిక పోటీ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సిహెచ్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

**18న ఫుట్‌బాల్, జూడో జట్ల ఎంపిక**

అండర్ 14, 17 విభాగంలో జూడో జట్లు ఎంపికలు రామభద్రపురం మండలం కొట్టక్కి జెడ్‌పి హైస్కూల్లో, ఫుట్‌బాల్ జట్ల ఎంపిక విజయనగరం రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఈ నెల 18న జరగనున్నాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జూడో ఎంపికల పర్యవేక్షకులు పీడీ కిషోర్ 9440127587, ఫుట్‌బాల్ పర్యవేక్షకులు పీడీ గోపాల్ 9494777753 మెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

### నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ శనివారం జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులంతా వినియోగించు కోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి తెలిపారు. ఉమ్మడి జిల్లాలైన, విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాలలోని అన్ని కోర్టు లలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని తెలిపారు. అదాలత్ లో పలు సివిల్, క్రిమినల్ కేసులు శాశ్వతంగా పరిష్కరించబడతాయని, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్, ప్రామిసరీ, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రి లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అనుమతితో శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి పాల్గొన్నారు.

# బుక్ కీపర్ల తొలగింపునకు కుట్ర

- అధికారులపై ఒత్తిళ్లు
- ఆందోళనలో మహిళా చిరుద్యోగులు

ప్రజాశక్తి - జామి

**పచ్చ నాయకుల పెత్తనం పరాకాష్టకు చేరుతోంది. అభం శుభం తెలియని నిరుపేదలపైనా అధికార పెత్తనానికి తెగబడుతున్నారు. తాము కక్ష సాధింపులకు దిగబోమని అది నాయకులు ఒక పక్క చెబుతుంటే...మరోవైపు గ్రామ, మండల స్థాయిల్లో టిడిపి నాయకులు నిరుపేద మహిళలను సైతం రోడ్డున పడేసేందుకు పన్నాగం పన్నుతున్నారు. ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు అందులో పని చేసే కార్మికులను తొలగించేందుకు పావులు కదపగా, తాజాగా వెలుగు కార్యాలయాల్లో పని చేస్తున్న నిరుపేద బుక్ కీపర్ల తొలగింపుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు వెలుగు అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో అడ్డగోలుగా అమాయక సిబ్బంది నుంచి అధికారులు రికార్డులను స్వాధీనం చేసుకోవడం కలకలం రేపుతోంది. మంత్రి ఇలాకాలోనే ఇటువంటి చర్యలకు దిగడం తీవ్ర చర్చకు దారితీస్తుంది. వివరాల్లోకి వెళితే....**

డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యుల వ్యవహారాలు చూసుకునే బుక్ కీపర్లు వారికి ఎంతగానో చేదోడు వాదోడుగా ఉంటారు. డ్వాక్రా సంఘాల రికార్డులు రాయడం మొదలుకొని, రుణ మంజూరైనప్పటి నుంచి వాటి వసూళ్ల వరకు బుక్ కీపర్లే దగ్గరుండి భాధ్యత పడతారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు అన్నింటికీ బుక్ కీపర్లను అధికారులు వాడుతుంటారు. ఇంతసేవ చేసిన వీరికి ప్రభుత్వం ఎటువంటి జీతభత్యాలూ ఇవ్వదు. కేవలం రూ.8 వేలు గౌరవ వేతనం మాత్రమే ఇస్తుంది. ఇలాంటి నిరుపేద సిబ్బందిని ప్రస్తుతం టిడిపి నాయకులు తొలగించాలని చూస్తున్నారు. అందుకోసం అడ్డగోలుగా అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు.

మండలంలో 25 పంచాయతీల్లో 1,520 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఇందులో 16,521మంది మహిళా సభ్యులు ఉన్నారు. కానీ వీరందరికీ కేవలం 39మంది బుక్ కీపర్లు మాత్రమే సేవలు అందిస్తున్నారు. వీరంతా గత ప్రభుత్వంలో నియమితులయ్యారని, ఎన్నికల్లో టిడిపికి వ్యతిరేకంగా పని చేశారన్నా అక్కసుతో వీరిని తొలగొంచాలని టిడిపి నాయకులు బావిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలోనే జాగారం, లక్ష్మి పురం, జట్టేటివలస, రామయ్యపాలెం, కుమరాం, లొట్లపల్లి గ్రామాల్లో బుక్ కీపర్లను తొలగించేందుకు అధికారులు పావులు కదుపుతున్నారు.

**తొలగింపు సాధ్యమేనా..?**

వాస్తవానికి బుక్ కీపర్ల నియామకం గ్రామైక్య సంఘాల సభ్యుల ఆమోదంతో జరుగుతుంది. అలాగే తొలగొంచాలన్న అదే గ్రామైక్య సంఘాల ఆమోదంతోనే సాధ్య పడుతుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే చెప్పారనో టిడిపి నాయకులు చెబుతున్నారనో తొలగొంచడం సాధ్యం కాదు. గతంలో ఇదే విషయాన్ని జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు మంత్రి దృష్టి కి తీసుకెళ్లగా, అధికారులు పద్ధతి ప్రకారమే ఉండాలని చెప్పారు.

### గ్రామైక్య సంఘాల ఆమోదంతోనే...

గ్రామైక్య సంఘాల్లో మహిళా సభ్యుల ఆమోదం లేకుండా బుక్ కీపర్లను తొలగించడం సాధ్యం కాదు. తొలగించేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. రికార్డులు పరిశీలించేందుకే వాటిని తీసుకురమ్మని చెప్పాం. అంతే తప్ప బుక్ కీపర్లను తొలగించడం లేదు.

- మధు మహేష్, వెలుగు ఎపిఎం, జామి

## చెరువు కబ్జాలపై చర్యలు తీసుకోండి



పల్లంట్ల చెరువును పరిశీలిస్తున్న తహశీల్దార్ సురేష్

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురంలో చెరువుల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల సంఘం ప్రతినిధి కొత్తల గౌరినాయుడు.. తహశీల్దార్ ఎం.సురేష్‌కు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. భోగాపురంలో సర్వే నెంబర్ 383లో పల్లంట్ల వారి చెరువులో సుమారు 12 సెంట్లు, సర్వే నెంబరు 314లో క్షీరసాగరం చెరువులో సుమారు 20 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు విన్నవించారు. తహశీల్దార్ స్పందిస్తూ గతంలో ఆళ్ల వాసుబాబు ఫిర్యాదుచేశారని వివరించారు. వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

**పల్లంట్ల చెరువు పరిశీలన**

భోగాపురం పడమర రెవెన్యూ పరిధిలోని పల్లంట్ల చెరువును తహశీల్దార్ సురేష్ పరిశీలించారు. ఆక్రమణలకు గురైనట్లు తమకు ఫిర్యాదులు అందడంతో పరిశీలించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ కిశోర్, మండల సర్వేయర్ మధుకేశ్వరరావు, విఆర్ఒ రామనాయుడు పాల్గొన్నారు.

## కుళాయి కనెక్షన్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో కుళాయి కనెక్షన్లు అవసరమైన వారు దరఖాస్తులను సచివాలయంలో అందజేసి తగు రశీదును పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కుళాయి కనెక్షన్లకు అవసరమైన దరఖాస్తులు ఆయా సచివాలయంలో మాత్రమే లభిస్తాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు అప్పటివరకు పూర్తిగా చెల్లించిన ఆస్తి పన్ను కాపీని అలాగే సదరు ఆస్తిపన్నుదారుని ఆధార్ కార్డు నకళ్ళను జతచేయాలని తెలిపారు. అదేవిధంగా అపార్టుమెంట్, గృహ సముదాయాలకు అవసరమైన కుళాయి కనక్షన్ల కోసం ప్లాన్ అప్రూవల్ కాపీ జత చేయవలసి ఉంటుందని తెలిపారు. సచివాలయం ద్వారా వచ్చిన కుళాయి కనెక్షన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన తరువాత సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటన చేసి కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు అవసరమైన అంచనాను రూపొందించి దరఖాస్తుదారునికి అందజేస్తామని తెలిపారు. కుళాయి కనెక్షన్లు పొందగోరే వారు రూ.200 చెల్లించి కుళాయి ఏర్పాటుకు అవసరమైన పైపులు ఇతర సామగ్రి కోసం అవసరమైన చెల్లింపులు చేసుకోవాలన్నారు. రూ.6వేల కుళాయి కనెక్షన్లు పొందగోరే వారు 6వేల నగదుతో పాటు పైపులు ఇతర సామగ్రి కోసం అవసరమైన మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. చెల్లింపులు పూర్తయిన తక్షణమే కొళాయి కనెక్షన్లను ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు.



జెండా ఊపి వ్యానును ప్రారంభిస్తున్న జెసి సేతు మాధవన్

## వరద బాధితులకు కూరగాయలు సరఫరా

**ఐదు టన్నులతో విజయవాడకు మరో ట్రక్కు**

ప్రజాశక్తి-విజయనగరం కోట

వరద బాధితుల సహాయార్థం జిల్లా యంత్రాంగం సరఫరా చేస్తున్న కూరగాయలతో రెండవ ట్రక్కు శుక్రవారం విజయవాడకు బయలుదేరింది. జిల్లాలో పలు రైతుబజార్‌ల నుంచి సేకరించిన ఉల్లి, బంగాళాదుంప, క్యాబేజ్, వంకాయలు, మిరప, దొండకాయలు, అరటి తదితర రకాలకు చెందిన ఐదు టన్నుల కూరగాయలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పంపించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ ట్రక్కును ప్రారంభించారు. జిల్లా నుంచి ఇప్పటికే తొలివిడత ఐదున్నర టన్నుల కూరగాయలతో ఒక ట్రక్కును పంపించినట్లు జెసి తెలిపారు. విజయవాడ పటమట రైతుబజార్‌లో ఈ కూరగాయలను స్థానికంగా వరద బాధితులకు పంపిణీ చేయనున్నట్లు మార్కెటింగ్ ఎడి బి.రవికిరణ్ తెలిపారు.

## కోడూరు పండగకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని కోడూరులో శనివారం జరిగే పండగకు వంద మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం పండగ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగకు 25 వేల మంది వరకు యాత్రికులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎక్కడికక్కడ పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## తగ్గిన స్కూల్ కాంప్లెక్సులు

### సిఆర్‌పిల్లో ఆందోళన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో నాలుగు స్కూల్ కాంప్లెక్సులు ఉండేవి. ఎస్‌కెఆర్‌పురం, వేపాడ, సోంపురం, బొద్దాం స్కూల్ కాంప్లెక్సుల్లో ఎంఇఒలు సమావేశాలు నిర్వహిస్తుండేవారు. ప్రస్తుతం స్కూల్ కాంప్లెక్సులను మూడుకు కుదించారు. దీంతో సిఆర్‌పిల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నలుగురు సిఆర్‌పిలలో ఎవరు ఉంటారు? ఎవరిని తొలగిస్తారోనని ఆందోళన చెందుతున్నారు..

## సంపూర్ణంగా తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-బొబ్బిలి

పైపులైన్ లీకులను నివారించి సంపూర్ణంగా ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. బలిజిపేట రోడ్డులో పైపులైన్ లీకుల పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైపులైన్ లీకులతో తాగునీరు వృథాగా పోతుందని, లీకులను నివారించి ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని ఎఇ సురేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఫిట్టర్ అప్పారావు, సిబ్బంది ఉన్నారు.

## విఆర్ఎస్ కాలువలో పూడికతీత

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయన సొంత నిధులతో వెంగళరాయ సాగర్ కాలువలో పూడిక తీయిస్తున్నారు. సాగునీటి కాలువలో పూడిక పేరుకుపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి తీసుకెళ్లడంతో సొంత నిధులతో ప్రొక్లెయినర్‌తో పూడికలు తీయిస్తున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం పిసి అండ్ పిఎన్‌డిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు, మూఢనమ్మకాల వల్ల గర్భంలో ఆడ శిశువు ఉన్నట్లు తెలిస్తే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా పెట్టాలని సభ్యులను సూచించారు. సమావేశంలో ఎస్ఐ లోవరాజు, వైద్యులు సంతోషికుమారి, రాజారావు, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే సంస్థానం పాఠశాల మార్గంలో సెవెంత్ స్కూల్ వద్ద రోడ్డు ఇరువైపులా ప్రమాదకరంగా ఉంది. ఇరువైపులా కాలువపై పలకలు లేకపోవడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ కోరారు.

## ఉపాధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సర్పంచులు, ఎంపిటిసిలతో ఉపాధి హామీ పనులపై ఎంపిపి అంబళ్ల సుధారాణి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో అన్ని పంచాయతీల్లో చేపట్టబోయే ఉపాధి హామీ పనులపై తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు ఎ.శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపిపి సారిక వైకుంఠం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని వీరసాగరం, తెంటువలస, డొంకినవలస గ్రామాల్లో శుక్రవారం వరి పొలాలను ఎఒ కె.శిరీష పరిశీలించారు. ప్రస్తుతం వరిలో వస్తున్న పాముపొడ తెగులును గుర్తించి, నివారణకు రైతులకు సూచనలు చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఇ-పంట నమోదు, ఇకెవైసి ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ సతీష్, శరత్, మురళి పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ జి.విజయలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని పాతబొబ్బిలిలో శుక్రవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సరుకులను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఐదుగురు పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, కోట రాములు, సూపర్ వైజర్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దివాస్


ప్రజాశక్తి-గరివిడి

కాపుశంభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. హిందీకి సంబంధించిన అనేక పజిల్స్, వ్యాకరణం, అంకెలు, అక్షరాలు లాంటి ఎన్నో వినూత్నమైన బొమ్మలు విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డి.రాము మాట్లాడుతూ జాతీయ భాష హిందీని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయిని జి.వి.ప్రీతి, ఉపాధ్యాయులు బి.పావని, బి.ప్రకాశరావు, కె.జనార్దనరావు, కె.గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-డెంకాడ

గణేష్ ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని పెదతాడివాడలో గురువారం రాత్రి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని వివరించారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని తెలిపారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మొక్కలు నాటుతున్న అధికారులు

## మొక్కలు నాటిన అధికారులు

ప్రజాశక్తి-వేపాడ

వనసంరక్షణ కార్యక్రమంలో భాగంగా వీలుపర్తి సచివాలయ ఆవరణలో శుక్రవారం మండల అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, బిసిఆర్‌సి పట్నాయక్, ఎంఇఒ జి.జగదీశ్వరరావు, అడ్మిన్ జెఇ దేవి, ఎఒ యశ్వంత్ కుమార్, పిఆర్ జెఇ అలీ, ఎపిఒ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి, సర్పంచ్ సేనాపతి లీల పాల్గొన్నారు.

## బొద్దాం మాజీ సర్పంచ్ సూర్యకాంతం మృతి

ప్రజాశక్తి-వేపాడ

బొద్దాం మాజీ సర్పంచ్ వల్లంశెట్టి సూర్యకాంతం (75) శుక్రవారం మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 1995 నుంచి 2000 వరకు ఆమె గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. వైసిపి నాయకులు దుల్ల మహేశ్వరరావుకు సూర్యకాంతం సోదరి.

## దోమల మందు స్ప్రేయింగ్

ప్రజాశక్తి-కొత్తవలస

నిమ్మలపాలెం పంచాయతీ రాయపురాజుపేటలో దోమల నివారణ మందును శుక్రవారం స్ప్రేయింగ్ చేశారు. సర్పంచ్ కొళ్లాడ నిర్మలనాయుడు, సెక్రటరీ ఆర్.అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యారావు, పావని, ఎఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

# వరద బాధితులకు అండగా బొబ్బిలి వైద్యులు



బొబ్బిలి.. ఎమ్మెల్యేకు నగదు అందజేస్తున్న డాక్టర్ శశిభూషణరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

వరద బాధితులకు అండగా బొబ్బిలి వైద్యులు నిలిచారు. వరద బాధితులకు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో వైద్యులు సిఎం సహాయ నిధికి స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. రూ.1.10 లక్షలను బొబ్బిలి ఐఎంఎ తరపున సీనియర్ వైద్యులు ఎ.గోపీనాథ్, అక్కేన దివాకర్‌బాబు అందజేశారు. వ్యక్తిగతంగా శ్రీవేణుగోపాల నర్సింగ్ హోమ్ వైద్యులు గోపీనాథ్ రూ.25 వేలు, భారతి ఆసుపత్రి వైద్యులు అక్కేన దివాకర్ బాబు రూ.20వేలు ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు రూ.25వేలు, శ్రీరామచంద్ర ఆసుపత్రి వైద్యులు రాంనరేష్ రూ.50వేలు, సదాశివ ఆసుపత్రి వైద్యులు పెంట రాకేష్ రూ.20వేలు, అభయ ఆసుపత్రి

### విద్యార్థుల నుంచీ విరాళాల వెల్లువ

వైద్యులు బూరి అనిల్ కుమార్ రూ.10వేలు, లాలిత్య ఆసుపత్రి వైద్యులు ఎన్.కె రావు రూ.20వేలు, సునీత ఆసుపత్రి వైద్యులు సునీత రూ.15 వేలు విరాళాలు ఇచ్చారు. వీరంతా ఎమ్మెల్యే బేబినాయనకు చెక్కులు, నగదు అందజేశారు. వరద బాధితులకు అండగా నిలిచిన వైద్యులను బేబినాయన అభినందించారు.

**జర్నలిస్టుల సాయం**

వరద బాధితుల కోసం బొబ్బిలి జర్నలిస్టులు రూ.30 వేలను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కె.శ్రీనివాస్, ఆర్‌కె నాయుడు, జగన్, జగదీశ్వరరావు, రమేష్, తవుడు, రఘు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీలక్ష్మి బాలాజీ ప్రమోటర్స్ ప్రతినిధులు కింతలి బంగార్రాజు, కింతలి శివ, గిరి, గెంబలి శ్రీనివాసరావు రూ.2 లక్షలను బేబినాయనకు అందజేశారు.

**గరివిడి :** విజయవాడ వరద బాధితుల కోసం శివరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు సేకరించారు. రూ.5516 నిధిని సమకూర్చారు. ఈ మొత్తాన్ని వరద బాధితులకు అందజేస్తామని ప్రధానోపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కుమిలి రామునాయుడు, వైస్ చైర్‌పర్సన్ దాసరి శాంతి పాల్గొన్నారు.

**వంగర :** వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థులు వరద బాధితుల కోసం విరాళాలు ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా కలిసి మొత్తం రూ.10 వేలు సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బెవర ఈశ్వరరావు, చక్రపాణి, పారినాయుడు, నేతాజీ పాల్గొన్నారు.



విజయనగరంటౌన్.. కలెక్టర్‌కు డిడి అందజేస్తున్న జరజాపుపేట విద్యార్థులు

**విద్యార్థుల వితరణ భేష్**

**విజయనగరం టౌన్ :** వరద బాధితులను ఆదుకొనేందుకు విద్యార్థులు చూపించిన చొరవను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. నెల్లిమర్ల మండలం జరజాపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, విజయవాడ వరద బాధితుల కోసం తమవంతు చిరు సాయం అందించడంతోపాటు, పలువురి దగ్గరనుంచి విరాళాలను సేకరించారు. పాఠశాలలో ఉన్న సుమారు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. వీరు సేకరించిన మొత్తం రూ.22వేలను కలెక్టర్ అంబేద్కర్‌కు డిడి ద్వారా శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, జెడ్‌పి స్కూల్ హెడ్‌మాస్టర్ వడ్డా ఆదినారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం చేయాలనే ఆలోచనతో విజయనగరంలోని 1వ డివిజన్ అయ్యప్పనగర్‌కు కొంతమంది చిన్న పిల్లలు స్వచ్ఛందంగా ఇంటింటికీ వెళ్లి సేకరించిన రూ. రూ.5312ను శుక్రవారం ఎమ్మెల్యేఅదితి విజయలక్ష్మి గజపతిరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన వారికి సహాయం చేయాలనే మంచి ఆలోచన చిన్న పిల్లలకు రావడం అభినందనీయమని అన్నారు.

## పాతికేళ్లు వెనుకబడిన వ్యవసాయ రంగం

ప్రజాశక్తి-భోగాపురం

ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నా.. వ్యవసాయ రంగం మాత్రం 25 ఏళ్లు వెనుకబడిందని రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు తెలిపారు. భోగాపురంలో విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద స్థానిక రైతులతో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం పెట్టుబడి పెరిగిపోవడం, దిగుబడి లేకపోవడం, పండిన పంటను అమ్ముకోలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దీన్ని అధిగమించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రెడ్డీస్ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రైతులకు కావలసిన వ్యవసాయ యంత్రాలను అందుబాటులో ఉంచామన్నారు. ఇంకా రైతులు కావాలనుకుంటే సబ్సిడీపై యంత్రాలు అందిస్తామన్నారు. వ్యవసాయాధికారి హరికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు మేలు చేయడానికి రెడ్డీస్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ దేముడుబాబు, భోగాపురం మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్ సతీష్, ఉదయ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎంఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

మహిళా భద్రతపై అవగాహన కల్పించేందుకు మహారాజా ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. పూల్‌బాగ్‌లోని కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ కోట వరకు కొనసాగింది. మహిళలపై దాడులు ఆపాలని, విద్యార్థులకు, మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

## బంటా మేస్త్రీలకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-రేగిడి



వాహన నమూనా కీని అందిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో 2023-24 క్రషింగ్ సీజన్‌లో అధికంగా చెరకు నరికిన బంటా మేస్త్రీలకు శుక్రవారం ఆ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షులు పట్టాభి రామిరెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ షణ్ముఖ సుందరం, క్రేన్ డిజియం రమేష్, హెచ్‌ఆర్ మేనేజర్ మురళీకృష్ణ ప్రోత్సాహకాలు అందించారు. చెరకు క్రషింగ్‌లో అధికంగా చెరకు నరికిన బంటా మేస్త్రిల్లో 13మందికి ఎల్ఇడి టివిలు, నలుగురికి ద్విచక్ర వాహనాలు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు.. ప్యారీ షుగర్స్ యాజమాన్యం ప్రతీ ఏటా ఇలాంటి ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందని తెలిపారు.

## 17 నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండో తేది వరకు స్వచ్ఛత కార్యక్రమాలను నగర పంచాయతీలో నిర్వహించాలని కమిషనర్ టివిఎస్ విశ్వేశ్వరరావు సూచించారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమాలు నగర పంచాయతీలో అన్ని వార్డుల్లో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, శానిటరీ కార్యదర్శులు, మెప్మా సిఎంఎం డి.గోవిందరావు, సిఒ బి.పోలినాయుడు పాల్గొన్నారు.

## ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురంలో జాతీయ రహదారి పక్కన హైస్కూల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 337లో ఉన్న తమ భూమిని కొందరు కబ్జా చేశారని, ఈ భూమిని సర్వే చేసి తమకు అప్పగించాలంటూ మాజీ సర్పంచ్ మూడడ్ల సత్యనారాయణ వారసులు మూడడ్ల ఆదిలక్ష్మి, అమృత, మహాలక్ష్మి కోరారు. ఆ స్థలం వద్ద శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. సర్వే నెంబర్ 337లో సుమారుగా రెండు ఎకరాలు భూమిని మాజీ సర్పంచ్ మూడడ్ల సత్యనారాయణ హైస్కూల్ కట్టడం కోసం ప్రభుత్వానికి దానం చేశారని తెలిపారు. అందులో మిగిలిన 12 సెంట్లను రికార్డులు తారుమారు చేసి కొల్లగొట్టేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ మిగులు భూమి ప్రభుత్వానికైనా చెందాలని, లేకుంటే వారసులకైనా దక్కాలని తెలిపారు. ప్రయివేటు వ్యక్తులు కబ్జా చెస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## జెఎన్‌టియులో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశకి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విశ్వ విద్యాలయంలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ విశ్వవిద్యాలయంలో గల రెండు ఆలయాలను సందర్శించాలని సూచించారు. అందులో మొదటిది గ్రంథాలయం, రెండోది ఆటస్థలం అని అన్నారు. మొదటిది జ్ఞానాన్ని పెంచుతుందని, రెండోది మనలో ఆరోగ్యాన్ని, ధైర్యాన్ని పెంచుతుందని అన్నారు. భారతదేశం మీ అందరి కోసం, మీరు ఎటువంటి ఇన్నోవేషన్స్ చేస్తారని ఎదురు చూస్తుందని అన్నారు. భారతదేశం ప్రపంచ దేశాలలో నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దే బాధ్యత మీ చేతుల్లో ఉందని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యో గాల కల్పన దిశగా ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఆర్ రాజేశ్వరరావు, ఉప ప్రధానాచార్యులు జిజె నాగరాజు, సమన్వయకర్త డాక్టర్ ఎం.సౌభాగ్యలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.




విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

## సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని క్లబ్ అధ్యక్షురాలు జి.శిరీష పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పూల్ బాగ్ లో ఉన్న శ్రీరస్తు కన్వెన్షన్ హాలులో ఇన్నర్ వీల్ క్లబ్ తరుణీ ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షురాలు శిరీష మాట్లాడుతూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తద్వారా వచ్చిన నగదుతో ఏడాది పొడవున సామాజిక సేవా, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గత ఏడాది పట్టణంలోని తోటపాలెం స్వర్గధామం లో షెడ్‌ల నిర్మాణం, బిపిఎం పురపాలక పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

## ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

### సెట్విజ్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి



ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తినిచ్చిందని యువజన సర్వీసులశాఖ (సెట్విజ్) సూపరింటెండెంట్ కచ్చాల కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 30న ఉద్యోగవిరమణ చేయనున్న ఆయన తన ఉద్యోగ జీవిత విశేషాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

నేను ఐటిఐ చదువుతున్న రోజుల్లో మా తండ్రి ఉద్యోగంలో ఉంటూ 1982లో అకాల మరణం పొందారు. దీంతో 1983 డిసెంబర్ 14న మొదట సారిగా రికార్డ్ అసిస్టెంట్ గా పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగంలో చేరాను. తరువాత ప్రమోషన్‌పై 1992లో జూనియర్ అసిస్టెంట్‌గా జిల్లా పరిషత్‌కు వెళ్లాను. 2001లో ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాను. అక్కడ నుంచి 2007లో జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యింది. 2011 వరకు ఇక్కడ పనిచేశాను. తరువాత వేపాడ మండల పరిషత్‌కు, డిఆర్‌డిఎకు, అదే సీనియర్ అసిస్టెంట్‌గా జిల్లా పరిషత్ కార్యాలయానికి వెళ్లాను. 2017 అక్టోబర్ 8న జామి మండల పరిషత్‌కు సూపరింటెంట్‌గా, 2019లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా జిల్లా పరిషత్‌కు వెళ్లాను. అక్కడ పని చేస్తూనే వేపాడ ఎంపిడిఒ (ఎఫ్ఎసి)గా 2022 వరకు విధులు నిర్వహించాను. 2022లో గరివిడి ఎంపిపి కార్యాలయానికి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా వెళ్లాను. 2023 మార్చి నుంచి ఎంపిడిఒగా (ఎఫ్ఎసి) అదే ఏడాది ఏప్రిల్ 28 వరకు పనిచేశాను. 2023 జులై 19న సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పై విజయనగరం జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్‌లో విధుల్లో చేరాను.

మా స్వగ్రామం ఎస్.కోట మండలం తిమిడి గ్రామం. మాది వ్యవసాయ నేపథ్యం గల కుటుంబం. కచ్చాల నరసింహులు, అప్పలనరసమ్మ దంపతులకు రెండో సంతానంగా 1962 సెప్టెంబర్ 15న జన్మించాను. మేము ముగ్గురం. అక్క, తమ్ముడు ఉన్నారు. తమ్ముడు ఎర్నాయుడు ప్రస్తుతం బొండపల్లి మండలం గరుడబిల్లి పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. మా స్వగ్రామం శృంగవరపుకోట మండలం తిమిడి గ్రామం. విద్యాభ్యాసం 10వ తరగతి వరకు జామి మండలం తిమిడి గ్రామంలో జెడ్‌పి హైస్కూలులో పూర్తి చేశాను. తరువాత మధురవాడ ఐటిఐ కళాశాలలో మిల్ రైట్ కోర్సు పూర్తి చేశాను. సత్య కృష్ణవేణితో వివాహమైంది. మాకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు కచ్చాల ఎర్ని వెంకట నరేష్, కుమార్తె ఎర్ని ఉదయలక్ష్మి. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా యుకెలో పనిచేస్తున్నాడు. కోడలి పేరు డాక్టర్ మృదుల. వీరికి ఒక కుమారుడు గణేష్ పూర్విక్ విహాన్స్ ఉన్నాడు. కుమార్తె ఉదయలక్ష్మికి కిరణ్‌తో వివాహమైంది. అల్లుడు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వీరు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరికి పాప నవ్యశ్రీ, మనుమడు జయేష్ ఉన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత ఊర్లో బస్సు షెల్టర్, ఒక దేవాలయాన్ని నిర్మిస్తున్నాను.

# 298 మద్యం సీసాలు స్వాధీనం

### ఆరుగురు అరెస్టు.. అందులో నలుగురు వైన్‌షాప్ సిబ్బందే

ప్రజాశక్తి-బాడంగి



వివరాలు వెల్లడిస్తున్న బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు

మండలంలో బెల్టుషాపులు యథేచ్ఛగా సాగుతున్నాయి. శుక్రవారం భారీ స్థాయిలో మద్యం సీసాలు పట్టుబడటమే అందుకు నిదర్శనం. మద్యం అక్రమ రవాణాలో ప్రభుత్వ వైన్‌షాప్ సిబ్బంది కీలకపాత్ర పోషించడం గమనార్హం. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు.. ఎస్ఐ తారకేశ్వరరావు కలిసి వివరాలు వెల్లడించారు. వారి కథనం ప్రకారం....

మండలంలోని గూడెపువలస రోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంతో వస్తున్నారు. పోలీసులను చూసి వారు వాహనాన్ని దారి మళ్లించారు. పోలీసులు వెంబడించి, తనిఖీ చేయగా 298 మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకొని విచారించగా, వాడాడ గ్రామానికి చెందిన అవ్వ శంకర్‌రావు, రెడ్డి రాఘవరావుగా తేలింది. బాడంగి మద్యం దుకాణం నుంచి తెస్తున్నట్లు వారు చెప్పారు. వైన్‌షాప్ సూపర్‌వైజర్ బాలాజీ, సేల్స్‌మేన్లు రామకృష్ణ, రామినాయుడు, దేవుడు.. కలిసి సీసాకి 20 రూపాయలు అదనంగా తీసుకుని ఇచ్చినట్లు పోలీసులకు తెలిపారు. దీంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కొండలరావు, సిబ్బంది ఉన్నారు.

## గోస్తనీ నదిలో దిగి ఎద్దులు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గోస్తనీ నదిలో దిగి ఎడ్లు మృతిచెందాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని కొట్టాం గ్రామంలో చోటుచేసుకుంది. కొట్టాం గ్రామానికి చెందిన ధర్మవరపు కోటారావు గోస్తనీ నదిలో టైరుబండిలో ఇసుక నింపి, బండితో ఒడ్డుకు చేరుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో నదిలో ఉన్న గోతుల్లో రెండు పశువులు దిగి, నీటిలో చిక్కుకున్నాయి. దీంతో ఊపిరి ఆడక నదిలోనే మరణించాయి.

**ఇసుక అక్రమ తవ్వకాల వల్లే**

ఇటీవల కురిసిన వర్షాలకు తాటిపూడి రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో గేటును తెరిచి 350 క్యూసెక్కుల నీటిని గోస్తనీ నదిలోకి విడిచారు. వర్షాలు తగ్గడంతో శుక్రవారం గోస్తనీలో నీటి ప్రవాహం తగ్గింది. దీంతో ఇసుక అమ్మకంపై కోసం ఆ వ్యక్తి ఇలా చేయడం వల్ల మూగజీవాలు తనువు చాలించాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఆరు నెలల క్రితం ఇదే గ్రామంలో బొడబోళ్ల అచ్చిబాబు అనే వ్యక్తి ఇసుక సేకరణకు టైరుబండిని నదిలో దింపడంతో ఇదే తరహాలో రెండు ఎడ్లు నీటిలో మునిగి చనిపోయాయి. ఇప్పటికే మండలంలోని వేములాపల్లి, చామలాపల్లి, మామిడిపల్లి, గోపాలపల్లి, కొట్టాం, కొత్తకోట ప్రాంతాల్లో ఇసుక సేకరణ కోసం నది మొత్తం గోతులమయంగా మార్చేశారు. దీంతో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, వెంటనే అక్రమ తవ్వకాలను నిరోధించాలని గోస్తనీ నది పరివాహక గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## నేరాలు ఘోరాలు

### 5.3 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒడిశా రాష్ట్రం నుంచి తమిళనాడుకు తరలిస్తున్న 5.3 కేజీల గంజాయిని బెలగాం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ı పార్వతీపురం బెలగం రైల్వే స్టేషన్ లో అక్రమంగా తరలిస్తున్న 5.3 కేజీల గంజాయిని ఆనంద్ సెల్వన్ దొరైను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వే కోర్టుకు తరలించినట్లు విజయనగరం జి ఆర్ పి ఎఫ్ ఎస్ఐ బాలాజీ రావు తెలిపారు.

**విజయనగరంలో 2కేజీలు..**

నగరంలోని డాబా గార్డెన్ జగన్నాథ స్వామి ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న ఒక ఇంట్లో బెహరా సంతోష్ కుమార్ గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. అతడి నుంచి 2కేజీల 250 గ్రాములు గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. ఈ గంజాయి అమ్ముతున్న వారిలో సంతోష్‌కుమార్‌తో పాటు వాసుపల్లి విజయ్ బాడసింగి లోహిత్ కొండేటి సంతు ఒక జూనియర్ ఉన్నట్లు తెలిపారు.

### 5 ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని బొడ్డవలస వద్ద నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు.